# వేణువు వేదన

ఆదివారంనాడు ఎగ్జిబిషన్ గ్రౌండంతా ఇసక వేస్తే రాలనట్టు జనం తిరుగుతున్నారు. లైట్లు ధగధగలాడుతున్నాయి. పిల్లలూ, పెద్దలూ 'కొనుగోలు' అనే ఉన్మాదంలో పడి కొట్టుకుపోతున్నారు. మిరపకాయ బజ్జీలనుండి, ముల్తానా మట్టి వరకూ ఏదో ఒకటి కొనాలనే తహతహతో తిరుగుతున్నారు.

ఏది కొనాలి? ఏది కొనకూడదు? ఏది కొంటే లాభం? ఏది చౌక, ఏది నాణ్యం?

వస్తువుల్ని కొనటంలో మనిషి కనిపెట్టిన ఆనందమంతా ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో బయటికొచ్చి నాట్యం చేస్తున్నట్లుగా ఉంది. వస్తువుల్ని చూసి, కొని, స్వంతం చేసుకునే పనిని సామూహికం - మరింత సామూహికం చేసే ఎగ్జిబిషన్లంటే జాఫర్‌కి పెద్ద ఇష్టం వుండదు.

అయినా లతకోసం దాదాపు పదిహేడేళ్ళ తర్వాత వచ్చాడు. లత అతని జీవితంలోకి, హైదరాబాదుకీ వచ్చి పదహారేళ్ళయింది. ఈ పదహారేళ్లలో లతకు కూడా ఏటా జరిగే ఎగ్జిబిషన్ చూడాలనే కోరిక కలగలేదు. ఈసారెందుకో ఆ కోరిక పుట్టింది. పిల్లలిద్దరూ సంక్రాంతి సెలవులకుఅమ్మమ్మగారింటికి వెళ్లారు. వీళ్లిద్దరూ ఏం తోచని వాళ్లలా ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో లక్షమంది జనంలో గాబరాగాబరాగా తిరుగుతున్నారు.

"ఇంత జనం, ఈ తొక్కిడి, ఒత్తిడి చూస్తే భయం - తప్పిపోతానేమోనని!" నవ్వింది లత

"నే చిన్నప్పుడు తప్పిపోయి దొరికాను!" జాఫర్ లతకింతవరకూ తెలియని కొత్త సంగతి చెప్పాడు.

లతకు జాఫర్‌ని చూస్తే అదే ఆశ్చర్యం, ఆనందం. అతని దగ్గర ఎప్పుడూ ఆమెకు తెలియని అనుభవమేదో ఒకటి ఉంటుంది. అది లతకు కుతూహలంగా కలిగించే క్షణాన్ని సరిగ్గా పట్టుకుని చెబుతాడు. ఆ చెప్పటం ఎలా చెబుతాడంటే జాఫర్‌తో మళ్ళీ కొత్తగా ప్రేమలో పడుతుంది లత.

అలా మళ్లీ మళ్లీ అతనితో ప్రేమలో పడే అనుభవం మరీమరీ ఇష్టం లతకు.

"ఎక్కడ తప్పిపోయావు చెప్పు?"

"ఏదో ఉర్సులో - చాలా పెద్ద ఉర్సు జరిగేది నా చిన్నప్పుడు. నాకు నాలుగేళ్లప్పుడు మా అమ్మతో కలిసి వెళ్లాను!" ఆగాడు.

"ఆఁ, వెళ్తే ...... ఎలా తప్పిపోయావు?" ఆత్రంగా అడిగింది లత. సమాధానం వెంటనే ఇవ్వడని తెలిసి రెండు నిముషాలు మౌనంగా నడిచింది.

ఏ విషయాన్నయినా క్యూరియాసిటీ బిల్డప్ చేయకుండా జాఫర్ చెప్పడు.

"అబ్బా, చెప్పు! ఎలాగూ చెప్తావుగా! తొందరగా చెప్తే నీ సొమ్మేం పోయింది?" గారాంగా అడిగింది.

సమాధానం రాలేదు.

"ఛీ! ఎప్పుడూ ఇంతే!" పక్కకు చూసిన లతకు ఒక్క క్షణం అయోమయంగా అనిపించింది.

జాఫర్ లేడు. తను జాఫర్ చెయ్యి ఎప్పుడొదిలింది? జాఫర్ తన చెయ్యి ఎప్పుడొదిలాడు?

చుట్టూ జనం. గందరగోళం.

ప్రతి చిన్న విషయానికీ కంగారుపడే స్వభావం లతది.

గబగబా అటూ ఇటూ హడావుడిగా పరుగులు తీసినట్టే నడిసింది. జనం తోసుకుంటున్నారు. అడ్డంపడుతున్నారు. నెట్టేస్తున్నారు. లతకు ఉక్రోషంతో కళ్ళనీళ్లు తిరిగాయి. ఇంత జనంలో చెయ్యి ఎందుకు వదలాలి? ఇప్పుడు తనేం చెయ్యాలి?

మైకులో ఎనౌన్స్ చేయించాలా? ఒక్కత్తే బస్సులో పడి ఇంటికి పోయి ఎదురుచూస్తూ కూర్చోవాలా?

అసలేమయ్యాడు జాఫర్? అంత చలిలోనూ చెమటలు పట్టిపోయాయి లతకు.

పది నిముషాలు ఈ యాతనతో గడిచాయి. కళ్లు అటూ ఇటూ తిప్పుతూ వెర్రిగా వెతుకుతోంది. ఇంతలో వెచ్చని చేయి వచ్చి లత చేతిని పట్టుకుంది.

"అబ్బా! ఏమయ్యావ్?" గట్టిగా అరిచేసింది లత.

"నేనేమవటం ఏంటి? నువ్వు తప్పిపోయి!" జాఫర్ నవ్వాడు.

"నేనా? నేను తప్పిపోయానా? నువ్వు తప్పిపోయావు." ఉక్రోషంగా అంది లత.

"సరిగ్గా అప్పుడు నేను మా అమ్మతో ఇలాగే అన్నాను!"

"ఎప్పుడు ?" మళ్ళీ లతలో కుతూహలం.

"ఉర్సులో తప్పిపోయినప్పుడు."

"ఔన్నూ, ఎలా తప్పిపోయావు? అమ్మో, ఇప్పుడు చెప్పొద్దులే! ఇంటికెళ్ళాక!" జాఫర్ చేతిని మోచేతిదాకా పెనవేసుకున్నట్లు పట్టుకుంది.

"భలే వెతికావులే. తప్పిపోయినప్పుడు అలా పరుగులుతీయకూడదు. ఉన్నచోటే నిలబడాలి. అప్పుడు తొందరగా దొరుకుతారు!" నవ్వుతున్న జాఫర్ వీపుమీద రెండు వేసి ముందుకు లాక్కెళ్ళింది లత.

లతకిష్టమైన ఐస్‌క్రీమ్ తినిపించి ప్రసన్నం చేసుకుంటూ కబుర్లు చెబుతున్నాడు జాఫర్.

లత ఆ కబుర్లకు విరగపడి నవ్వుతూ సడెన్‌గా ఆగింది.

"అదేంటి ... అలా ...?" అంటున్న జాఫర్ మాటలు వినిపించుకోకుండా గబగబా నాలుగడుగులు ముందుకేసి ఒకావిడ చెయ్యిపట్టుకుని ఆపింది. ఆమె లతని చూసింది.

ఇద్దరూ కావలించుకున్నంత పని చేశారు.

ఆవిడ్ని లాక్కొచ్చి జాఫర్‌కి చూపిస్తూ - "నా ఫ్రెండు! సరళ అని చెప్పానే ... పదిహేనేళ్ళనుంచీ తప్పించుకు తిరుగుతోంది!"

"ఎగ్జిబిషన్‌లో దొరికింది - ఎనౌన్స్ చేయకుండానే!" జాఫర్ లత వాక్యాన్ని పూర్తిచేశాడు.

ముగ్గురూ నవ్వుకుంటుంటే - "ఎక్కడికెళ్లావు చెప్పకుండా?" అంటూ సరళ మొగుడొచ్చాడు.

అందరూ పరిచయాలు చేసుకున్నారు.

పదిహేనేళ్లుగా గల్ఫ్‌లో ఉండటంవల్ల కలవలేకపోయానని చెప్పింది సరళ.

ఇప్పుడిక హైదరాబాదులోనే సెటిల్ అయ్యారు. వచ్చి ఇరవై రోజులే అయింది గాబట్టి లత గురించి ఇంకా వాకబు చెయ్యలేదు. ఇప్పుడిక ఒకళ్ల అడ్రస్ ఒకళ్లు తీసుకున్నారు.

"మా ఇంటికెళ్లే దారిలోనే మీ ఇల్లు. డ్రాప్ చేస్తాం రండి!" అన్నాడు సరళ మొగుడు కారు తాళాలు ఊగిస్తూ.

"మా వాహనంలో వెళ్తాంలెండి!" అన్నాడు జాఫర్, లూనా తాళాలకోసం జేబులో తడుముకుంటూ.

"ఏ వాహనం?" కుతూహలంగా అడిగాడు సరళ మొగుడు.

"లూనా!" అన్నాడు జాఫర్ తాళాలు బయటకు తీస్తూ.

"అదే అనుకున్నాలెండి. మీ ముఖాలు చూస్తే మారుతీ 800 ఉన్నట్టుగా కూడా లేవు!" అన్నాడు సరళ మొగుడు నిరసనగా.

"మా ముఖాలు ఎప్పటికీ ఇలాగే ఉండుగాక!" అన్నాడు జాఫర్.

అందరూ నవ్వారు. ఎవరిదారిన వాళ్ళు వెళ్లారు.

చలికి జాఫర్‌ని కావలించుకుని కూర్చుంది లత.

"ఆ సరళ మొగుడు ఏమీ మారలా! ఎలా మాట్లాడతాడో ...!" అంది లత కాస్త విసుక్కుంటూ.

"ఏమన్నాడు?"

"మన ముఖాల గురించి - మారుతీ కూడా లేనట్టున్నాయని. ఎదుటివాళ్ళని బాధపెడుతున్నామని కూడా చూడకుండా ఎలా మాట్లాడతారీ మాటలు?" లతకిప్పుడు బాధ కూడా వచ్చింది.

"అందులో బాధపడటానికేముంది? మన బట్టలు, నీకొక్క నగ కూడా లేకపోవటం ఇవే గదా మన వర్గాన్ని చెప్పేవి. నేను వాహనం అనేసరికి అతనికి అనుమానం వచ్చింది మనం ఏ వర్గమా అని తేల్చేసుకున్నాడు!"

"అంత మొరటుగానా?" ఈసడించుకుంది లత.

"అదతని స్వభావం. తెలియటం మంచిదే గదా! మనం కాస్త దూరంగా ఉంటాం."

"కానీ నేనూ, సరళా చాలా మంచి స్నేహితులం."

"స్నేహంగా ఉండండి!" అది పెద్ద విషయం కాదన్నట్టు తేల్చేశాడు.

"అబ్బబ్బ! నీదంతా సింపుల్ బుర్ర!" విసుక్కుంది లత.

"నీదంతా కాంప్లికేటెడ్ బుర్ర!"

లత మూతి తిప్పేసరికి లూనా ఇంటిముందు ఆగింది.

అన్నాలు తిని బట్టలు మార్చుకున్నాక లత నిట్టూర్చి అంది - "ఎగ్జిబిషన్‌కెళ్ళి ఒట్టి చేతులతో తిరిగొచ్చింది మనమేనేమో!"

"చాలామంది మనలాగే వస్తారు. మనం తప్పిపోకుండా వచ్చాం, చాలు!" జాఫర్ మంచం మీద దుప్పట్లు దులిపి వేస్తున్నాడు.

"ఔనూ, నువ్వు ఉర్సులో ఎలా తప్పిపోయావో చెప్పనేలేదు!"

లతకు ఆ విషయం జ్ఞాపకం వచ్చినందుకు సంతోషం కలిగింది.

"చెప్తాలే!" రిలాక్స్‌డ్‌గా అన్నాడు జాఫర్.

"చెప్పు!"

"ఇప్పుడు చెప్పాల్సింది తప్పిపోవటం గురించి కాదు."

"మరి?"

"చిక్కిపోవటం గురించి."

"అంటే ...?" అనుమానంగా అడిగింది లత.

"భవుని కౌగిటన్ పార్వతి

పార్వతి కౌగిటన్ భవుడు

నా కౌగిట నీవు వోలె

నీ కౌగిట నేను వోలె - చిక్కిపోవటం గురించి మాట్లాడుకోవాలి!" లతను దగ్గరకు లాక్కున్నాడు జాఫర్.

"చిక్కిపోవటం గురించి మాట్లాడుకోవాలా? నీకు తెలుగు కవిత్వం ఇలాంటప్పుడు మాట్లాడటానికా నేర్పింది!" అని లత అంటూండగానే -

"ఏ రాత్ ఏ చాందినీ ఫిర్ కహా సున్‌జా దిల్‌కీ దాస్తా!"

జాఫర్ హృదయగానాన్ని వింటూ పరవశంగా కళ్లు మూసుకుంది లత.

ఇక ఆ తర్వాత మాటలు లేవు.

* * * * *

"అయితే మీరిద్దరూ అందర్నీ ఎదిరించి పెళ్ళి చేసుకున్నారన్నమాట! మతాంతర వివాహం కదూ?" సరళ మొగుడు కాఫీ తాగుతూ అడిగాడు. తెలిసిన సంగతుల గురించి తప్ప తెలియని సంగతుల గురించి అతను కొత్త ప్రశ్నలు వేయలేడు. కొత్త ప్రశ్నలు వేయటానికి, కొత్త సంగతులు మాట్లాడటానికీ అతని బుర్రలో గుజ్జు ఉండదు.

సరళ ఎప్పటిలాగే భర్త ప్రవర్తనకూ, మాటలకూ సిగ్గుపడటానికి రెడీ అయి కూర్చుంది.

లత చికాకు పడుతోంది.

జాఫర్ మాత్రం ఆనందిస్తున్నాడు సరళ మొగుడు బోలుతనాన్ని. అప్పుడప్పుడూ ఇలాంటి బోలుతనాన్ని చూడకపోతే జీవితంలో లోతూ, గాఢతల విలువ మర్చిపోతామని అతని నమ్మకం.

"హైదరాబాదులో పుట్టి, హైదరాబాదులో పెరిగి, హైదరాబాదులో ఒక్క స్థలం సంపాదించలేదా మీరు?" ఇంత పనికిమాలిన వాళ్లుంటారా అన్నట్టు పదోసారి ఆ ప్రశ్న అడిగాడు సరళ మొగుడు.

"హైదరాబాదులో పుట్టి హైదరాబాదులో పెరిగినవాళ్లం కాబట్టే హైదరాబాదులో స్థలం కొనాలనిపించలేదండీ! హైదరాబాదంతా మనదే కదా అనిపిస్తుంది!" అన్నాడు జాఫర్ స్పోర్టివ్‌గా.

"వెంటనే అర్థం కావు కానీ, మీరు భలే మాట్లాడతారు!" సరళ మొగుడు సర్టిఫికెట్ ఇచ్చాడు.

"హర్ ముల్క్ ముల్కె మాస్త కె ముల్కే ఖుదాయె మాస్త!" అంది లత.

"ఆయన మాటలు కష్టపడితేనన్నా అర్థమవుతాయి. మీ భాషే అర్థమై చావదు.

ఆయన ముస్లిం. మీరు హిందీ, ఉర్దూ మాట్లాడతారు. మీరు తెలుగు ఆయన తెలుగులో మంచిగా మాట్లాడతాడు - అంతా చిత్రం!" అన్నాడు సరళ మొగుడు.

సరళ మొగుడుకి పేరుంది. కానీ అతను ఇంజనీరు అవటంతో ఇంజనీరుగారూ అని పిలిపించుకోవటం ఇష్టం. ఇంజనీర్లు తక్కువగా ఉన్నకాలంలో ఇంజనీరు అయ్యాడేమో - ఇప్పుడు ఇంటింటా పిల్లలు ఇంజనీర్లవటం కోసమే పుట్టి పెరుగుతున్న రోజుల్లో కూడా- అతనికా సరదా తీరకపోవటం అతనికి వయసుతోపాటు మెదడు పెరగలేదనటానికి నిదర్శనం.

గల్ఫ్‌లో సంపాదించిన డబ్బుతో హైదరాబాదంతా కొనెయ్యాలనే తపనను పంచుకోటానికి జాఫర్ వాళ్ళు అనువుగా దొరికారు ఇంజనీరుగారికి.

అతనిలాగే హైదరాబాదంతా కొనాలనుకునే అతని వర్గం వాళ్ళు అతని మాటలు వినకపోగా, అవే మాటలు అతనికి చెప్తారు. జాఫర్ సరదాగా ఇంజనీరుగారిని ఒక మాట అంటూనే ఆయన మాటల్ని వింటాడు. ఈలోపల లత, సరళ చిన్ననాటి ముచ్చట్లు చెప్పుకుంటూంటారు.

అందువల్ల ఇంజనీరుగారి ఇంపోర్టెడ్ కారు తరచుగానే జాఫర్ ఇంటిముందు ఆగేది. జాఫర్ లూనా కూడా ఇంజనీరుగారింటి ముందు ఆగేది.

'రెండు నెల్లే కదా అయింది నేను సెంచరీ హిల్స్‌లో స్థలం కొని! అదిప్పుడు పది రెట్లు పెరిగింది. నేను రెండు లక్షలు పెట్టి కొన్నా. ఇప్పుడిరవై లక్షలకు అడుగుతున్నారు. రెండు నెలల్లో 18 లక్షల లాభం. ఏ వ్యాపారంలో వస్తుంది చెప్పండి?" అంటూ ఉత్సాహపడుతూ వచ్చేవాడొక రోజు.

"చాలా పొరపాటు చేశానండీ! పదిలక్షలు పెట్టి మాదాపూర్ దగ్గర కొన్నానా? నెలరోజులయింది రూపాయి పెరగలా - ఎంత వడ్డీ దండగ?" అనేవాడు ఇంకోరోజు వచ్చి.

ఆయన విషాదాన్నీ, ఆనందాన్నీ పంచుకోటానికి జాఫర్ దంపతులు తప్ప దొరకలేదు.

తన వర్గం వాళ్లు తన బాధకు సంతోషించటం, తన ఆనందానికి ఏడవటం ఎంత తెలివితక్కువవాడైనా అతనికి తెలుస్తూనే ఉంటుంది.

తోటి ఇంజనీర్లంతా ఎంత పనికిమాలిన వాళ్లో చెప్పుకోటానికీ అతనికి జాఫరే దొరికాడు.

జాఫర్ ఇంజనీరు కాడు మెకానిక్, ఐటిఐ చేశాడు. చిన్న వర్క్‌షాప్ నడుపుకుంటాడు. అందువల్ల కూడా వాళ్లు కలుసుకునే రోజులు ఎక్కువయ్యాయి.

ఏ మాటకామాటే చెప్పుకోవాలి. లతకు ఒంట్లో బాగోలేక హఠాత్తుగా హాస్పిటల్‌కు

వెళ్లాలన్నా, లూనా చెడిపోయిన రోజు జాఫర్ వర్క్‌షాపుకు వెళ్లాలన్నా, లత స్కూలుకి వెళ్లాలన్నా ఇంజనీరుగారు తన కారులో లిఫ్టిచ్చేవాడు.

"ఇంజనీరుగారికి ఆ డబ్బుపిచ్చ లేకపోతే మంచివాడే!" అనే వాడు జాఫర్.

"డబ్బు పిచ్చ ఉందనేగదా నాభయం, సరళ భయం!" అనేది లత.

"డబ్బుపిచ్చ లేనిదెవరికిలే!"

"ఒక్క జాఫర్‌కి తప్ప!" కంప్లయినింగ్‌గా అంటుంది లత.

జాఫర్ తెలివికి జాఫర్ బాగా డబ్బు సంపాదించగలడని లత నమ్మకం.

సంపాదించకూడదని జాఫర్ నమ్మకం.

* * * * *

"జాఫర్‌గారూ! మీకు హైదరాబాదు బాగా తెలుసు కదా! కొండాపూర్ ఏరియాలో స్థలాలు కొనటం మంచిదేనా? పెరిగే స్కోప్ ఉందా?" అంటూ వచ్చాడొక రోజు పొద్దున్నే ఇంజనీరుగారు.

"కొండాపూర్‌కేమండీ? బ్రహ్మాండమైన చోటు. సెంట్రల్ యూనివర్సిటీకి రెండు కిలోమీటర్లే దూరం!"

లత కాఫీ కలుపుకొస్తానని లేచింది. ఆమెకి రియల్ ఎస్టేట్ మాటలు వింటుంటే కడుపులో వికారంగా ఉంటోంది.

లత కాఫీ కలుపుతుండగా, "లతా! డేవిడ్ వచ్చాడు. ఇంకో కప్పు కాఫీ కావాలి!" అని కేకేశాడు జాఫర్.

డేవిడ్‌ని ఇంజనీరుగారికి పరిచయం చేశాడు జాఫర్.

డేవిడ్ ఇంజనీరుగారిని గౌరవంగా చూసి, "ఇంత పెద్ద ఇంజనీరుగార్ని పెట్టుకుని నువ్వేంటి భాయ్, ఆరునెలల నుంచి తిప్పలు పడుతున్నావు!" అన్నాడు.

"నా తిప్పలు నేను పడటం నా కలవాటు కదా!" అన్నాడు జాఫర్.

"తిప్పలేంటి? తిప్పలేంటి ...?" అని తబ్బిబ్బయ్యాడు ఇంజనీరుగారు తన ఇంజనీరుతనాన్ని గౌరవించిన డేవిడ్‌ని కాస్త ప్రసన్నంగా చూశాడు.

"లేదు, సార్! మా కొక ప్రాక్టికల్ ప్రాబ్లెమ్ వచ్చింది!" అంటూ సమస్య చెప్పాడు డేవిడ్.

"మాకు పెస్టిసైడ్ డబ్బాలు ... అదేనండీ పొలాలకేసే పురుగుమందుల డబ్బాలు పాక్ చేయించే కాంట్రాక్టు వచ్చింది. కంపెనీల వాళ్లకు ఈ పాకింగ్ న్యూసెన్స్‌గా ఉండి

మాబోటివాళ్ళకు కాంట్రాక్టు ఇస్తున్నారు. ఒక అట్టపెట్టెలో ... అదేనండీ, కార్టన్‌లో ఇరవైనాలుగు డబ్బాలు పడతాయి, ఒక డబ్బా పాక్ చెయ్యటానికి కనీసం ఇద్దరు మనుషులు అరగంట పనిచేస్తే కానీ అవటంలేదు. నున్నగా ఉండిచస్తాయి కదండీ, జారిపోతాయి! ఆ సైజు కూడా అటూ ఇటూ గాని సైజు, రెండుకంటే ఎక్కువ ఒకేసారి పట్టుకోలేం. చాలా యాతనగా ఉంది. అంత యాతనగాకపోతే కంపెనీవాళ్లే చేసుకునేవాళ్లు కదండీ!

"దానికొక మిషన్ కనిపెట్టాలని జాఫర్ చూస్తున్నాడు. ఆరు ఆరు డబ్బాలు ఒకచోట పెట్టటం, నాలుగుసార్లు అట్లా ఆరేసి డబ్బాలని ఒకచోట చేర్చి అన్నింటినీ కలిపి ఒకేసారి అట్టపెట్టెలో సర్దేసి సీలెయ్యటం - ఇదండీ ఈ మిషను చెయ్యాల్సిన పని! జాఫర్ బుర్రంతా పెడుతున్నాడు. తెగ శ్రమపడుతున్నాడు. ఒకచోట దొరికిన దారి ఇంకోచోట దొరకటంలేదు!

"దీనికి ఏదైనా చిన్న మార్గం కనుక్కోవాలి. జాఫర్ ఆరునెలలనుంచీ పైసా ఆదాయం లేకుండా వర్క్‌షాప్‌లో దీనిగురించే పనిచేస్తున్నాడు!"

ఇంజనీరుగారు సమస్యను మళ్లీ డేవిడ్‌తో చెప్పించుకున్నాడు. పది నిముషాలు సీరియస్‌గా ఆలోచించాడు. చివరికి చెప్పాడు - "ఏ మార్గం లేదు! మీరిప్పుడు చేస్తున్నట్టు చెయ్యటమే! దానికో చిన్న మెషిన్ కనిపెట్టగలిగితే ఈపాటికే కనిపెట్టేవారు కదా! మీరూ, జాఫరూ కలిసి కనిపెడతారా? జోగి జోగి రాసుకుంటే రాలేది బూడిద! ఈయన ఐటిఐ మీకేదైనా ఉందా?"

లేదని తలాడించాడు డేవిడ్.

"ఆరు నెలలనుంచీ ఏ సైటు చూద్దామన్నా నాకు పని ఉంది, రాలేను అంటున్నాడు! దమ్మిడీ రాని ఈ పనికోసమా?"

"జాఫర్! మీరు బాగుపడరు. నా దగ్గర ఏజెంట్‌గా చేస్తే ఆరు నెలల్లో ఆరు స్థలాలు అమ్మితే ఆరు పదులు ... అరవై వేలిచ్చేవాడిని కదా!"

జాఫర్‌కి ఎంత అణుచుకుందామన్నా ఆగని చిరాకు వచ్చింది.

"ఇంజనీరుగారూ! మీకు అర్థం అవుతుందో, కాదో నాకు తెలియదు కానండీ, నాకు ఒక పని క్రియేటివ్‌గా కొత్తగా చెయ్యటం, దాని గురించి ఆలోచించటం చాలా ఇష్టం. చాలా ఆనందం! ఆ ఆలోచనలవల్లా, పనులవల్లా డబ్బురాదు. రాదని నాకు తెలుసు. కానీ దానితో నాకువచ్చే ఆనందం ఉందే, అది ఎంత డబ్బు పెట్టి కొందామన్నా దొరకదు. ఆ సత్యం నాకు ఎంత బాగా తెలుసంటే, మీరెన్ని చెప్పి నాతో డబ్బుకోసం మాత్రం పనులు చేయించలేరు. ఒకవేళ నేను డబ్బు సంపాదించినా అదంతా మళ్లీ నా ఆలోచనల్ని క్రియేటివ్‌గా ఒక రూపంలోకి తేవటానికే ఖర్చుపెడతాను!" ఇంజనీరుగారితో ఇంత సీరియస్‌గా మాట్లాడటం జాఫర్‌కిదే మొదటసారి.

"మిమ్మల్నెవరూ బాగుచేయలేరు!" ఇంజనీరు జాఫర్ మాటల్ని బుర్రకెక్కించుకుని, దాన్ని వేడెక్కించుకునే సత్తా ఉన్నవాడు కాదు.

"మేం చాలా బాగా ఉన్నామండీ! మాగురించి దిగులుపడనవసరం లేదు!" అంటూ కాఫీ కప్పులతో వచ్చింది లత.

"అది నిజమే! మీరిద్దరూ చిలకా గోరింకల్లా ఎప్పుడూ నవ్వుతూ తుళ్లుతూ ఉంటారు!' అని ఒప్పేసుకున్నాడు ఇంజనీరు.

"మీరు కూడా ఉండొచ్చు, సరళ మాట వింటే!"

"సరేలెండి! ఆవిడ మాట వింటే అడుక్కుతినేవాణ్ణి!"

లత మాట తీసిపడేసి కాఫీ తాగి వెళ్లిపోయాడు ఇంజనీరు.

* * * * *

మరో మూడు నెలలు గడిచాయి.

ఆ సాయంత్రం వీధిలోంచే జాఫర్ పాట వినపడితే ఆశ్చర్యంగా బయటికొచ్చింది లత.

"నిజంగానే! నిజంగానే! ... నిజంగానే! నిజంగానే!!"

శ్రీశ్రీ పాట పాడుతూ ఇంట్లోకొస్తున్న జాఫర్ మొహంలో ఆనందం చూసి ఆశ్చర్యపోయింది లత.

జాఫర్ ఆనందంగా ఉండని క్షణాలు అరుదే కానీ, ఇవాల్టి ఆనందం అతని మొహంలో లత ఇంతవరకూ చూడలేదు.

"నిజంగానే - నిజంగానే !"

"ఏంటా నిజం?" ఉత్సుకత పట్టలేక అడిగింది.

"తొందరగా చెప్పు! ఎందుకంత ఆనందం?"

"ఆనందం అర్ణవమైతే, అనురాగం అంబరమైతే
ప్రపంచమును పరిహాసిస్తాం భవిష్యమును పరిపాలిస్తాం!"

"ఏం జరిగింది చెప్పు, ప్లీజ్! చెప్పవా?" ఎక్కడలేని ఆత్రం లత గొంతులో,

"చెప్తా, మంచినీళ్లివ్వు!" ఎక్కడలేని తాపీతనం జాఫర్ గొంతులో.

"ఇవ్వను! ముందు చెప్పు! నన్ను చంపకు!" లత మొండికేసింది.

"యంత్రానికి ప్రాణం పోసి వచ్చా! నా ప్రియమైన ప్రేయసిని చంపుతానా?"

"అంటే..." లతకేదో అర్థమైంది.

"అంటే!" జాఫర్ వెక్కిరింతగా లతను ఇమిటేట్ చెయ్యటంతో లతకు అర్థమైపోయింది.

"సక్సెసా? చెయ్యగలిగావా? సాధించావా?" లత జాఫర్‌ని ఊపేసింది.

"సందేహమా? పద, నీకు చూపించాలనే, నిన్ను తీసుకెళ్లాలనే వచ్చా!" లత ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయింది.

"అజ్ హమ్ ఊపర్, ఆస్మా నీచే!" అని పాడుతూ బట్టలు మార్చుకుంటోంది.

"సినిమా పాటలేంటి - అంతకన్నా మంచివి దొరకలేదా?" నవ్వాడు జాఫర్.

"వస్తే, నువ్వు పాడరాదా?" లత.

"నేనూ నా సహచరుడూ - నలుదిక్కులా ప్రయాణించి
ఒకే ఒక్క తామరపువ్వును కోసుకొచ్చాం. మేమిక
ఎన్ని కిరణాలతో గుణించుకున్నా
మా చుట్టూ ఒకే ఒక్క సూర్యోదయం!" జాఫర్ గంభీర స్వరంలో ఆ భావం మరింత గంభీరమైంది.

"అది పాట కాదు, కవిత!" లత వెక్కిరించింది.

"ఏదైతేనేం? చెమట నుండి పుట్టింది. నా చెమట ఒక అద్భుతాన్ని సాధించింది. రా, చూద్దాం!" లతను లాక్కెళ్లాడు జాఫర్.

లూనా గాల్లోనే ప్రయాణించింది.

జాఫర్ ఆనందం చూసి లత మళ్లీ కొత్తగా అతన్ని ప్రేమించటం మొదలుపెట్టింది.

ఎప్పటికప్పుడు తనమీద కొత్తగా ప్రేమ ఇనుమడింపచేసుకునేలా చేస్తాడు - తనలా చెయ్యలేదు కదా అని దిగులుపడబోయేంతలో వర్క్‌షాప్ వచ్చేసింది.

అక్కడ జాఫర్ తొమ్మిది నెలల కష్టం అప్పుడే పుట్టిన పసిపాప నిదరోతున్నట్టుగా ఉంది.

జాఫర్ తన చేతులతో దాన్ని తట్టి లేపాడు. పొత్తిళ్లలో బిడ్డను సవరించినట్లు సవరించాడు, లాలించాడు.

జాఫర్ చేతుల్లోంచి ఆ యంత్రం మీదకు వర్షిస్తున్న ప్రేమను చూస్తుంటే లతకు అసూయ అనిపించి, వెళ్లి అంతమందిలోనూ జాఫర్ భుజంమీద చేయి వేసింది.

జాఫర్ ఆ చేతిని గట్టిగా పట్టుకుని వెనక్కు నడిచాడు.

పసిపాప తొలినవ్వులా, కాళ్లూ చేతులూ కదలించే కేరింతలా యంత్రం తన పని మొదలెట్టి దిగ్విజయంగా పూర్తిచేసింది.

అందరూ చప్పట్లు కొట్టారు. స్వీట్లు పంచారు. స్నేహానందాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

మర్నాడు జాఫర్ ఇంట్లో విందుకి ఇంజనీరుగారికి ఆహ్వానం వచ్చింది.

ఇంజనీరుగారు భోజనప్రియుడు, విందు అంటే ఎందు? ఎందుకు? అని అడక్కుండా వెళ్లిపోతాడు.

జాఫర్ ఇంట్లో కూడా అలాగే విందుకుడిచి-'ఇంతకూ ఈ విందు ఎందుకిచ్చినట్లు?' అనడిగాడు చేపల కూర మత్తులోంచి బయటపడే ప్రయత్నం చేస్తూ, వక్కపొడి నములుతూ.

"అసాధ్యాన్ని సాధ్యం చేసినందుకు. ఆ యంత్రం పూర్తయింది!"

జాఫర్ మాట పూర్తవకుండానే ఇంజనీరు గారి గొంతులో వక్కపొడి అడ్డంపడి, "వాట్ ?" అని కూడా అనలేక మంచినీళ్లకోసం హడావుడి చేసి, అంత హడావుడిగానూ జాఫర్‌ని కారెక్కించుకుని వర్క్‌షాప్‌కి తీసుకెళ్లి దాన్ని చూశాడు.

ఇంజనీరుగారి బుర్ర ఎన్నడూ లేనంత వేగంగా పనిచేస్తోంది.

"ఏం చేస్తారు దీన్ని?"

"ఏం చేస్తాం? డేవిడ్‌కి ఇస్తాను. అతను వాడుకుంటాడు. ఇంకెవరన్నా కావాలని అడిగితే ఇంకోటి తయారుచేసి ఇస్తాం."

"అలా కాదు, చాలా మందికి ఈ మిషన్‌తో అవసరం ఉంటుంది. సరుకులు తరలించే పని ఉన్న ప్రతివాడూ దీన్ని కొంటాడు. ఈ మిషన్‌ని లార్జ్ స్కేల్‌లో తయారుచేసి అమ్మితే బోలెడు లాభాలు!"

జాఫర్ నవ్వాడు. "ఇలాంటిదొకటి ఉందని తెలిసి వచ్చిన వాళ్ల దగ్గర ఆర్డరు తీసుకుని చేసి ఇస్తాను. నాకు లార్జ్ స్కేల్ లాభాలమీద ఆశ లేదులెండి!"

"అలాక్కాదు, మీకు తెలయిదు. మీరు చాలా గొప్పగా చేశారు. దీన్ని ఊరికే పోనివ్వకూడదు. మార్కెట్‌లోకి పంపాలి. డీలర్లను పట్టుకోవాలి!" ఇంజనీరుగారిని పట్టనలవి కావటంలేదు.

జాఫర్ ఇంత మంచి మెషిన్ కనిపెట్టి పట్టనట్లుండటం ఆయనకు మింగుడు పడలేదు.

మర్నాటినుంచి ఇంజనీరుగారు ఎవరెవర్నో కార్లలో వర్క్‌షాప్‌కి తీసుకురావటం, చూపించటం, చర్చించటం, వాళ్లు "ఆహో! ఓహో! దీన్ని ఊరికే పోనివ్వకూడ"దనటం.

ఈ తతంగమంతా ఒక నెలరోజులపాటు నడిచింది.

"ఆ మెషిన్ డేవిడ్‌కి ఇచ్చి నీ పని నువ్వు చూసుకోక ఈ గోలంతా ఏమిటి?" అని లత అడిగితే,

"చూద్దాం, ఇంజనీరుగారికి పెద్ద ఆశలున్నట్లున్నాయి!" అన్నాడు జాఫర్.

"ఆయన పెద్ద ఆశలు మనతో తీర్చుకోవాలని చూస్తే మన చిన్న ఆశలు కూడా తీరకుండా పోయేలా ఉన్నాయి. నెలరోజుల్నించీ నీకు ఆయన ఫ్రెండ్స్‌ని ఎంటర్‌టైన్ చేయటంతో సరిపోతోంది!" లత తన కోపాన్నీ, అయిష్టాన్నీ దాచలేదు.

"ఆరు నెలలు ఆ మిషన్‌కోసం అన్నీ మానేసి పనిచెయ్యలేదా? అప్పుడు నీకే కంప్లయింట్ లేదు."

"అప్పుడు నువ్వు ఆనందంగా ఉన్నావు. ఇప్పుడు నీలో ఆనందం కనిపించటంలా. ఏదో భయం, అభద్రత! నిన్నిలా చూడటం నాకేమీ బాగోలా!"

"ఇది కొత్త ఫీల్డ్ కదా!" పిల్లల మంచాల దగ్గర మస్కిటో కాయల్ పెడుతున్నాడు జాఫర్.

"అంటే ప్రొడక్షన్లోకి దిగి, మార్కెటింగ్ చేద్దామనా?" లత ఆశ్చర్యంగా, నమ్మలేనట్లుగా అడిగింది.

"ఔను!" ఆలోచనగా అన్నాడు జాఫర్.

"వద్దు, మనకిది అనవసరం, మనకు తెలియని చోటికి మనం వెళ్లటం ఎందుకు?'

"డబ్బు సంపాదిద్దామని!" ఎందుకో జాఫర్ నవ్వులో ఉత్సాహం లేదు. పేలవంగా ఉంది.

"నువ్వు ... నువ్వు డబ్బు సంపాదిద్దామనుకుంటున్నావా?"

"ఔను."

"ఎందుకూ?"

"ఎందుకంటే - డబ్బెందుకు? సుఖపడటానికి. నాకోసం ఎన్నింటినో, ఎంత డబ్బునో వదులుకుని వచ్చావు. నిన్ను ఇంకాస్త సుఖపెడదామని."

"డబ్బుతో సుఖపెడతావా?" లత నిర్ఘాంతపోయింది జాఫర్ మాటలకు.

"అది కాదు, కొన్ని సౌకర్యాలు సమకూర్చుకోవచ్చు. మీ స్నేహితులంతా గొప్పవాళ్లు. కార్లలో తిరుగుతుంటారు. నువ్వూ ఓ కారులో తిరిగితే బాగుండదూ?" జాఫర్ మళ్లీ నవ్వేందుకు ప్రయత్నించి విఫలుడయ్యాడు.

"జోక్ చేస్తున్నావా?" సీరియస్‌గా అడిగింది లత.

"కొంచెం సీరియస్సే! మనమధ్య ప్రేమ ఉంది. డబ్బు కూడా ఉంటే మరింత

సుఖంగా ఉంటామేమో!" జాఫర్ బలహీనంగా అన్నాడు.

"అట్లా డబ్బు కావాలంటే - అమ్మానాన్నా, తమ్ముళ్లూ నాకు ఇస్తానని బతిమాలుతున్న ఆస్తి తీసుకోవచ్చుగా! మనకు హాయిగా జరిగి పోతుంది!"

"అది నాకిష్టంలేదు."

"ఎందుకని? వాళ్లు మొదట మన ప్రేమని అరిగించుకోలేకపోయారు. నువ్వు ముస్లింవని చాలాద్వేషించారు. నిజమే, కానీ తర్వాత ఎంత తొందరగా నిన్ను తెలుసుకున్నారు? నాకంటే ఎక్కువగా వాళ్లు నిన్ను ప్రేమిస్తున్నారే?"

"ఏమో! వాళ్ల దగ్గరనుంచి డబ్బు తీసుకోవటం నాకిష్టం లేదు. నా అంతట నేను, మనంతట మనం సంపాదించుకోవచ్చు!" జాఫర్ గొంతులో లత ఆస్తి ప్రసక్తి రాగానే ఎప్పుడూ వచ్చే కఠినత్వం వచ్చేసింది.

లతకు అది అర్థమై జాఫర్ మీద సానుభూతితో అంది - "సంపాదించుకోవచ్చు. సంపాదించుకోగలం. నిజమే, కానీ ఈ డబ్బు పిచ్చుగాడ్ని పట్టుకుని మాత్రం కాదు!"

"అతన్ని నేనేం పట్టుకున్నాను. అతనే నన్ను పట్టుకున్నాడు."

"ఆ పట్టు వదిలించుకో!" గట్టిగా చెప్పింది లత.

"తమాషాగా ఉంది. వదిలించుకోవటం కుదరటంలా, అతనట్లా చొచ్చుకొస్తున్నాడు. నేను అంత రూడ్‌గా ఉండలేకపోతున్నాను."

ఇంజనీరుగారు నిజంగానే చొచ్చుకు వచ్చాడు. ప్రొడక్షన్ మొదలుపెట్టాలన్నారు. పెట్టుబడి పెట్టాలన్నారు. ఎస్టిమేషన్లు తయారయ్యాయి. ఇంజనీరుగారు ఒక పార్టనర్‌గా ఒకొంతు డబ్బు పెడతాడు. జాఫర్ దగ్గర డబ్బు లేదు కాబట్టి లోను తీసుకుంటాడు. అదతను తీర్చుకుంటాడు.

అన్ని ఏర్పాట్లూ చకచకా జరిగిపోతున్నాయి. కాలంకూడా పరిగెత్తినట్లే వెళ్లిపోతోంది. కొన్ని రోజుల్లో మిషన్లు మార్కెట్‌లోకి వెళ్లిపోతాయి.

జాఫర్ రాత్రింబగళ్లు అదే ధ్యాసతో శక్తంతా పెట్టి పనిచేస్తున్నాడు.

ఇంజనీరుగారు అయ్యే పనులు కూడా అవడంలేదని కంగారుపెట్టి కంగారుపడి వెళ్లిపోతున్నాడు.

అసలు డబ్బు పెట్టుబడి పెట్టినదగ్గర్నుంచీ అతనికి ఒకవైపు కంగారు, మరొకవైపు అధికారం ఏదో, కొత్తగా వచ్చిన ఫీలింగ్.

చాలా సార్లు జాఫర్ని భాగస్వామి అని మరిచిపోయి తనదగ్గర పనిచేసేవాడిలా చూస్తున్నాడు. అది జాఫర్ పట్టించుకోవటంలేదు కానీ లతకు చాలా బాధగా ఉంది.

ఇన్ని గందరగోళాల్లోనూ ఒత్తిడులలోనూ ప్రొడక్షన్ మొదలైంది.

"అసలివి ఎవరైనా కొంటారాంటావా?" ఇంజనీరుగారు బి.పి. పెంచుకుంటూ అడిగాడు. జాఫర్ మాత్రం తొణకకుండా - "కొనటానికి ఎంత అవకాశం ఉందో కొనకపోవటానికి కూడా అంత అవకాశం ఉంది!" అన్నాడు.

"అదెల్లా ... అదెట్లా?" జాఫర్ మాటలెప్పుడూ అర్థం కావు.

"ఈ మెషిన్ చేసే పని కార్మికులు చేస్తున్నారు. ఈ మెషిన్ కొనటం వల్ల కార్మికుల శ్రమ తగ్గుతుంది. కార్మికుల శ్రమ తగ్గటం గురించి యజమానులకు శ్రద్ధ ఉండదు.కొనటం దండగ అనుకుంటారు. కొనరు!" జాఫర్ స్థిరంగా అన్నాడు.

"అసలు కొనరా?" ఇంజనీరుగారి బి.పి. ఒక్కసారి పడిపోయింది.

"కొనొచ్చు. ఈ మెషిన్ వల్ల వాళ్లకు టైమ్ కలిసొస్తుంది. పదిపాకెట్లు చేసే టైమ్‌లో యాభై పాకెట్లు రెడీ చేస్తారు. టైమ్ ఈజ్ మనీ అని గ్రహించే తెలివితేటలున్న నిజమైన కాపిటలిస్ట్‌లు ఉంటే వాళ్లు కొంటారు."

"నాకు పిచ్చెక్కుతోంది. ఈ మాటలు ముందే ఎందుకు చెప్పలేదు."

"నాకూ ఇదంతా తెలియదు. తోచలేదు. అసలు ప్రొడక్షన్ ఆలోచనా, మార్కెటింగ్ విషయాలూ నాకు తెలియదు. నాకు వాటిగురించి తెలియదని కూడా చెప్పాను."

"మరీ ఇప్పుడీ విషయాలు ఎలా చెప్తున్నావు?"

ఇంజనీరుగారికి ఆవేశం పెరిగిపోతోంది,

"శుద్ధ కామన్‌సెన్స్‌తో చెప్తున్నాను. మార్కెటింగ్ గురించి తెలిసి కాదు!"

ఇంజనీరుగారు జుట్టు పీక్కుంటూ వెళ్లిపోయారు.

తయారయ్యే మిషన్ల గురించి పేపర్లో ప్రకటనలు ఇచ్చారు. సేల్స్‌మెన్‌ని పెట్టారు. కరపత్రాలు, పోస్టర్లు, వేసి ఇండస్ట్రియల్ ఏరియాలలో అంటింపించారు.

ఏమీ రెస్పాన్స్ లేదు.

"కనీసం తయారైన సరుకునన్నా అమ్మ గలమా?" అని ఇంజనీరుగారు పిచ్చెక్కినవాడిలా తిరుగుతున్నాడు.

డీలర్‌షిప్ తీసుకోమని ఎవరెవరినో పిలుచుకొస్తున్నాడు. చూపిస్తున్నాడు.

చివరికి ఇంజనీరుగారిని మించిన ధనవంతుడు, పారిశ్రామికవేత్తా, ఒకాయన, ఇంజనీరుగారిని రక్షిస్తానంటూ వచ్చాడు. తయారై ఉన్న మెషిన్లన్నీ కొంటానన్నాడు.

బేరం సెటిలయింది. మొత్తం విలువ 20 లక్షలు.

"అమ్మకాలతో సంబంధం లేకుండా 8 లక్షలు ఇచ్చి తీసుకుంటాను. అమ్మిన

తర్వాత మిగిలింది ఇస్తాను!" అన్నాడు.

వెంటనే ఇంజనీరుగారికి కొంత భారం తీరుతుందని జాఫర్ ఒప్పుకున్నాడు. ఆ మెషిన్ల విలువ ముప్ఫై లక్షల పైనేనని అతనికి తెలుసు.

ఇంజనీరుగారి స్నేహితుడు మిషన్లు తీసుకెళ్లాడు. డబ్బు తర్వాత ఇస్తానన్నాడు. రెండు రోజుల తర్వాత ఒక లక్ష పంపించాడు.

ఇక రోజులు గడుస్తున్నాయి గానీ డబ్బు రావటంలేదు. అవి అమ్ముడుపోవటంలేదంటాడు. అమ్మకాలతో సంబంధం లేకుండా 8 లక్షలు ఇస్తానన్నావు గదా అంటే మాట్లాడడు. ఇంజనీరుగారు తన శ్రేయోభిలాషిగా చేరిన స్నేహితుడి పక్షమే అయ్యాడు.

"అమ్ముడుపోనిది ఎక్కడ తెచ్చిస్తాడు? నిజానికి అతనిచ్చిన లక్షా మనం అతనికి ఇచ్చెయ్యాలి?" అంటాడు.

జాఫర్‌కి ఇది వ్యాపారమా? స్నేహమా? జూదమా? అర్థం కాలేదు.

లోను కట్టటానికి తన వర్క్‌షాప్ అమ్మితే సరిపోతుంది. దాంతో ఈ పీడ వదుల్చుకుని బయటపడదామని నిశ్చయించుకున్నాడు.

లత కూడా అదే అంది. డబ్బు కంటే శాంతి ముఖ్యం అని వాళ్లు ఇదివరకు అనుకున్నారు గానీ ఇప్పుడు అది అనుభవంలోంచి తెలిసొచ్చింది.

ఇంజనీరుగారికి తను పెట్టింది రాలేదని కడుపు మండుతోంది.

"మిషన్ పెటెంట్ ఇస్తాను, తీసుకోండి!" అన్నాడు జాఫర్,

"తీసుకుంటాను గానీ, ఎవరూ కొననిది ఆ పెటెంట్ నాకెందుకు" అంటాడు.

"అసలు మార్కెట్‌లోకి మనం వెళ్ల లేదు కదా! ఎలాంటి ప్రొడక్టయినా టేక్ ఆఫ్ చేసేసరికి సంవత్సరమన్నా పట్టదా?" జాఫర్ అంటాడు.

"అంతకాలం నేను ఓపికపట్టలేను. ఈ డబ్బు రియల్ ఎస్టేట్‌లో పెడితే ఈ పాటికి పదిరెట్లయ్యేది!" అంటాడు ఇంజనీర్.

"దానికి నన్నేం చెయ్యమంటారు? నేను వద్దన్నా వినకుండా మీరిందులోకి దిగారు, నన్ను దించారు!" జాఫర్ సహనం పెరిగిందే కానీ తరగలేదు.

"కంపెనీలకు స్వయంగా వెళ్లి తిరుగు! ఆర్డర్లు బుక్ చెయ్!" ఇంజనీరుగారి వివేకం పూర్తిగా నశించింది.

"నేను సేల్స్‌మాన్‌ని కాదు!" జాఫర్ నిగ్రహంగానే అన్నాడు.

"ఇంత డబ్బు పెట్టించి ఇప్పుడిలా అంటావా?"

"నేను పెట్టించానా? నేను వద్దు బాబో అన్నాను!"

నిజాన్ని భరించే శక్తిలేని ఇంజనీరుగారు ఇక అక్కడ ఉండలేక వెళ్లిపోయాడు. నెలరోజులు కనపడలేదు.

"ఆయన మన మిషన్లు కొన్న ఇండస్ట్రియలిస్టుతో కలిసి కొత్త ఇండస్ట్రీ ఏదో పెడుతున్నాడట - సరళ చెప్పింది!" అంది లత ఒకరోజు. ఈ మెషిన్లు తయారుచేసే ఇండస్ట్రీయేమోనని లత అనుమానం.

"ఎలాగోలా చావనీ! నేను పీడకల మరిచిపోయి నా పనిలో పడాలి! పోతే వర్క్‌షాప్ పోతుంది. పోనీ, ఎలాగోలా బతకలేకపోం!" అన్నాడు.

"కానీ ఆ డీలర్ ఇస్తానన్న ఎనిమిది లక్షల్లో మనవంతు రావాల్సింది వస్తే వర్క్‌షాపు మిగులుతుందిగా!" అంది లత.

"పోనీయ్, లతా! నేనో పొరపాటు చేశాను. వర్క్‌షాపు పోగొట్టుకుంటాను. దానికోసం ఇంకా చికాకు పడలేను!" అన్నాడు జాఫర్.

"సరేలే, ఎలాగోలా ఈ కంపెనీ క్లోజ్ అయితే మనం శాంతిగా బతకొచ్చు!" అంది లత కూడా.

వాళ్లు మర్నాడు ఆదివారం స్నేహితులందరినీ పోగేసుకుని పిక్నిక్‌కి వెళ్లివచ్చారు.

నాలుగు రోజుల్లో ఉగాది పండగొస్తే జాఫర్ తన స్నేహితులందరినీ పిలిచి పూర్ణం, పులిహోరలతో, ఉగాది పచ్చడితో మంచి భోజనం పెట్టాడు.

ఇంజనీరుగారు కూడా వచ్చి భోజనం చేసి వెళ్లాడు.

లత తమ్ముడు వీళ్ల తిప్పలన్నీ చూస్తూనే ఉన్నాడు. ఆర్థికంగా ఏ సాయమూ జాఫర్ తీసుకోడు. ఏం చెయ్యాలా, అక్కనెలా సంతోషపెట్టాలా అని ఆలోచించాడతను. అతని కుటుంబం, లత కుటుంబ ఒక వారం రోజులు అరకులోయ వెళ్లి అక్కడ గడిపేందుకు అన్ని ఏర్పాట్లూ చేశాడు.

లత ఈ ఒక్కసారికీ నాకోసం ఈ ట్రిప్ ఒప్పుకోమని అడిగితే జాఫర్ కాదనలేక పోయాడు.

లత తమ్ముడు ప్రసాదంటే జాఫర్‌కి. జాఫరంటే ప్రసాద్‌కీ ప్రాణం, కానీ ప్రసాద్‌నుంచి ఒక్క పైసా తీసుకోడు జాఫర్. అదంతా వాళ్ల పెళ్లి సమయంలో జరిగిన గొడవ వల్ల వచ్చింది.

ఇప్పుడుకూడా లత సంతోషం కోసం, తన పొరపాటువల్ల లత చాలా సఫరయిందనే భావంతో జాఫర్ ఈ ట్రిప్‌కు ఒప్పుకున్నాడు.

అన్ని ఏరాట్లూ చకచకా జరిగిపోతున్నాయి. మళ్లీ ఇంట్లో పాటలు, పిల్లలతో ఆటలు, స్నేహితులతో కబుర్లు.

జాఫర్ లతలకు జీవితాన్ని ప్రవహింపచేసుకోవటం తెలుసు. నిలవనీటి బతుకంటే ఇద్దరికీ రోత.

"శాంతము లేకా సౌఖ్యములేదు !" జాఫర్ పాడుతుంటే లత చాలా రోజుల తర్వాత హాయిగా విన్నది ఆ రాత్రి.

మర్నాడు ఉదయాన ఏడాది తర్వాత హాయిగా నిద్ర లేచారు ఇద్దరూ. ఆదివారం, పిల్లల్ని ప్రసాద్‌తీసుకెళ్లాడు. ఇద్దరూ లేచి చాలా రోజుల తర్వాత తమ పూర్వ కార్యక్రమంలోకి వెళ్లారు. తమకు రాత్రి వచ్చిన కలలు చెప్పుకున్నారు తీరిగ్గా.

వంటింట్లోకి వెళ్లి టీ కాచుకుని పాట్‌లో పోసుకుని టీ సెషన్‌కి రెడీ అయ్యారు.

వైతాళికులు, ఎంకి పాటలూ, శ్రీశ్రీ మహాప్రస్థానం, గద్దర్ పాటలూ తీసుకున్నారు.

ముందు నాకిష్టమైన పాట నువ్వు పాడాలి!" అంది లత.

"కాదు, నాకిష్టమైన పాట నువ్వు పాడాలి!" జాఫర్.

ఇద్దరూ కాసేపు మారాం చేసుకున్న తర్వాత లతే ముందు పాడింది.

"కొండ తిరిగి కోననడిగి

చీర చెరగున కూరిచితిరా

గరికపూలా కంతమాలా!" లత గొంతులో ఆ భావం పలికిన తీరుకు ఆగలేక అక్కున చేర్చుకున్నాడు జాఫర్.

"గరికపూల కంతమాలతో సంతోషపడే నా ప్రేయసికి రత్నహారాలు తేవాలని ఎంత యాతన పడ్డాను. ఎంత యాతన పెట్టాను!"

"పోన్లే, ఇంత యాతన పడినా నిజం తెలుసుకున్నాంగా! మరిప్పుడు నా కిష్టమైన పాట నువ్వు పాడు!"

"ఎనక జల్మములోన ఎవరిమో నంటి. సిగ్గొచ్చి నవ్వింది సిలక నా ఎంకి

ముందు మనకే జల్మముందోలెయంటి - తెల్లతెలబోయింది పిల్ల నా ఎంకి

ఎన్నాళ్లో మనకోలె ఈ సుఖములంటి - కంట నీరెట్టింది జంట నా ఎంకి!"

జాఫర్ గొంతులో నండూరి ఆ పాటలో కూర్చిన తాత్విక వేదనంతా, ప్రేమసారమంతా ఉబికి వచ్చింది.

లత ఆ పాట పారవశ్యంలోంచి ఇంకా తేరుకోనే లేదు.

ఇంటిబయట ఇంపోర్టెడ్ కారు ఆగింది. ఇంజనీరుగారు దిగారు. లోపలికి వస్తూనే, "లెక్కలు చూడాలి. ఆ కంపెనీ క్లోజ్ చెయ్యాలి!" అన్నారు.

"అలాగే!" అన్నాడు జాఫర్.

ఇద్దరూ పుస్తకాలు తీసి అంకెలు వేస్తున్నారు. పూర్తవుతున్నాయి.

"ఆ డీలర్ ఇవ్వాల్సిన ఎనిమిది లక్షలూ మర్చిపోయారా?" అప్పటిదాకా చూస్తూ కూర్చున్న లత అంది.

"డోంటాక్ రబ్బిష్! చెత్తవాగుడు వాగమాక! ఆడదానివి నీకెందుకీ గొడవలు?"

లత స్టన్ అయింది. తను పుట్టి బుద్దెరిగాక ఎవరూ అనని మాటలు.

లతనంత మాట అనటం విని, సహించలేని జాఫర్ - "ఏమిటి మాట్లాడుతున్నారు మీరు?" అని కోపంగా లేచాడు.

"మరి ఆవిడనేదేంటి? ఆ సరుకు అమ్ముడుపోక అతనేడుస్తుంటే ..."

"మీరనుకున్నట్లు మేం అనుకోవటంలేదు. సరుకు తీసుకున్న అతను అగ్రిమెంట్‌ని గౌరవించాలనుకుంటున్నాం!" లత ఊరుకోలేకపోయింది.

"అగ్రిమెంటేమిటి? బోడి ... బొచ్చు ... నన్ను సేవ్ చెయ్యటానికి వచ్చాడాయన! నాకోసం లాసయ్యాడు. అతనేం ఇవ్వడు!"

"అతనివ్వకపోతే మీరివ్వాలి!" అంది లత.

"స్టుపిడ్! నోర్ముయ్ ! బిజినెస్ సంగతి నీకెందుకు? గెటవుట్ ఫ్రమ్ హియర్! అంట్లు తోముకునే వాళ్లకు అతి తెలివిలొచ్చి ...."

జాఫర్ భరించలేకపోయాడు.

"మాటలు మర్యాదగా రానివ్వరా!" అంటూ లేచాడు

లతకు జాఫర్ కోపం చూసి భయం వేసి లోపలకు లాక్కుపోబోయింది.

"బాస్టర్డ్స్! ఇడియట్స్!" ఇంజనీరుగారు తిడుతున్నాడు.

"నీ మాట వినకుండా ఈ డబ్బున్న లంజాకొడుకుల్ని నమ్మినందుకు ఇన్ని మాటలు పడాల్సివచ్చింది!"

లతను విడిపించుకుని ముందుకొచ్చాడు జాఫర్.

"అలా నమ్మకే అడుక్కుతింటున్నారు. అడుక్కుతినే బుద్ధులు చూపించకండి! ఆ బుద్ధుల్ని బట్టే మీ కిలా జరుగుతోంది!"

"ఎవర్రా అడుక్కుతినేది?" కోపంతో జాఫర్ ముఖం ఎర్రగా అయింది.

"నువ్వేరా ఇడియట్!" ఇంజనీరు పైకి లేచి జాఫర్‌ని పటపటా ముఖంమీదా, మెడమీదా, తలమీదా ఇష్టంవచ్చినట్లు కొట్టి, "మళ్లీ ఆ డబ్బు సంగతడుగు, నీ ఎముకలు

ఏరేయించేస్తా! నా డబ్బంతా లాస్ చేయించి ... నీ అంతు చూస్తాను!"

జాఫర్ చెయ్యెత్తకుండా నిగ్రహించుకోటానికి గోడపట్టుకు నిల్చున్నాడు.

లత కుప్పకూలిపోయింది.

డేవిడ్ ఏదో పనిమీద అప్పుడే వచ్చాడు.

వీళ్లిద్దరినీ ఈ స్థితిలో చూసి కంగారు పడిపోయాడు.

"ఏమిటి? ఏమిటి?" అని అడిగితే, జాఫర్ మాట్లాడకుండా కూర్చున్నాడు.

లతే జరిగింది చెప్పింది.

డేవిడ్ ఆగ్రహం పట్టలేకపోయాడు. "ఎవడు వీడు? ఎక్కడోడు? ఒక్క కేకేసి మన వర్కర్లను పిలిచామంటే సున్నంలోకి ఎముక మిగలదు! వీడంతు తేలుస్తాను. జాఫరంటే ఏంటనుకున్నాడు?" అని బయలుదేరబోయాడు.

జాఫర్ అతన్ని బలవంతాన ఆపాడు. "వద్దు. అతనితో స్నేహం, అతనితో కొంత టైమ్ గడపటం, మన జీవితాల్లోకి అతన్ని చొచ్చుకురానివ్వటం - ఇదంతా మనం చేసిన పొరపాటు. ఆ పొరపాటుకి ఇది ఫలితం. సింపుల్ - న్యూటన్ లాస్ ఆఫ్ మోషన్! ఫర్ ఎవ్వరి యాక్షన్ దేరీజ్ యాన్ ఈక్వల్ అండ్ అపోజిట్ రియాక్షన్. ఇది అంతే!" నచ్చచెప్పాడు.

"అంటే .... అతను కొట్టి వెళ్లిపోతే మనం చేతకాని వాళ్లలా ఊరుకోవటమేనా!"

"ఊరుకోవద్దు! క్షమాపణ చెప్పాలని అడుగుదాం. అతను క్షమాపణ చెప్పకపోతే అప్పుడు చూద్దాం!"

డేవిడ్ వెళ్లి ఇంజనీరుగారికి, అతని భార్యకు, స్నేహితులకు ఫోన్ చేశాడు - ఇరవై నాలుగు గంటల్లో క్షమాపణ చెప్పకపోతే పరిస్థితి చెయ్యిజారిపోతుందనీ, జాఫర్‌ని కొట్టినందుకు ఇంజనీరుగారు ఫలితం అనుభవిస్తారనీ.

ఇంజనీరుగారి తరఫు పెద్దమనుషులు కంగారుపడి వచ్చారు.

జాఫర్‌కి వర్కర్స్‌లో ఉన్న పేరు వాళ్లకు బాగానే తెలుసు. అదీగాక ఇంజనీరు చేసింది తప్పని కూడా వాళ్లు నిజంగానే అనుకున్నారు. వ్యవహారాలుంటే మాట్లాడుకోవాలి గానీ, కొట్టటమేమిటని అందరూ బాధపడ్డారు. అందరూ ఇంజనీరుగారిది తప్పనీ, ఆయన స్వభావం బలహీనమనీ, కాస్త ఎబ్‌నార్మల్ మనిషనీ, మూర్ఖుడనీ ... ఇది జరగకుండా ఉండాల్సిందనీ సిన్సియర్‌గానే అన్నారు.

అతను క్షమాపణ చెప్తాడన్నారు.

జాఫర్‌కి అతని మొహం చూడాలని లేదు.

"క్షమాపణ లతకు చెప్పమనండి. కంపెనీకి సంబంధించిన లావాదేవీలు మీరు

సెటిల్ చేసి వెళ్లండి!" అన్నాడు.

బాంక్ లోను వర్క్‌షాపు అమ్మి కడతాడు జాఫర్. పేటెంట్‌లో మూడోవంతు ఇంజనీరుగారికి ఇవ్వాలి. ఆ మిషన్ ఎలా అమ్ముడవుతుందో నమ్మకం లేదు కాబట్టి ఇంజనీరుగారు మొదట పెట్టిన నాలుగు లక్షల పెట్టుబడిలో సగం - అంటే రెండు లక్షలు జాఫర్ వెంటనే కట్టాలి.

పెద్దలంతా తీర్మానించారు.

వర్క్‌షాప్‌తోపాటు మరో రెండు లక్షల అప్పుకూడా మీద వేసుకుని ఇంతటితోనైనా ఈ పీడ వదిలితే అదే చాలనుకున్నాడు జాఫర్. అలా డాక్యుమెంట్లు రాసుకుని సంతకాలు చేసుకున్నారు.

ఇదంతా అయ్యేసరికి రాత్రి పన్నెండు గంటలయింది. జాఫర్ పక్కన డేవిడ్ తప్ప ఎవరూ లేరు.

లతను ఓదార్చటానికీ, ఏడవవద్దని చెప్పటానికి కూడా ఎవరూ లేరు.

ఓదార్చే సమయం జాఫర్‌కి దొరకలేదు.

అందరూ వెళ్లాక లతను జాఫర్ ఒళ్లోకి తీసుకుంటే వెక్కివెక్కి ఏడ్చింది.

"మనల్ని అడుక్కుతినే వాళ్లంటాడా? ఎవర్ని అడుక్కున్నాం మనం? నేను ఎన్ని సంపదల్ని కాలదన్ని వచ్చానో, డబ్బునెంత తృణప్రాయంగా చూశానో వాడికి తెలుసా? మనల్ని అడుక్కుతింటున్నామంటాడా?" లత ఏడుపు ఆగటంలేదు.

"లతా!" పెద్దగా కేకేశాడు జాఫర్.

"ఈ లోకంలో అన్నీ తలకిందులుగా కనపడతాయి. ఇతరుల శ్రమను అడుక్కుతినేవాడు గొప్పవాడవుతాడు. శ్రమించేవాడు అడుక్కుతినేవాడవుతాడు. ఈ మాటలకు విలువ ఇస్తే మనకు శాంతి ఉండదు. మనం అడుక్కుతినేవాళ్లం కాదని మనకు తెలుసు. అది తెలిసీ ఎవరో అన్న మాటలకు బాధా, ఏడుపూ ఎందుకు? అర్థం లేదు! నా పుటకా, నా రక్తం, నా జీవిత విధానం, ప్రతిదీ చెమటతో ముడిపడిందే గానీ ఇంకోటి కాదు. ఎవరో కవి అన్నట్టు - 'గొర్రెల అమాయకత్వాన్ని కబ్జా చేసుకుని, గోవుల సాధుత్వాన్ని పట్టా రాసుకునేవాళ్లు' వాళ్లు అడుక్కుతినేవాళ్లు. మనం కాదు! కానీ మనం చేసిన పొరపాటు - కాదు, ఘోరమైన తప్పు ఉంది. లేకపోలేదు. మనం - పోనీ నేను - కింది తరగతివాడ్ని. మైనారిటీ జాతివాడ్ని. మధ్యతరగతికి చేరాం. పై తరగతివాళ్లతో స్నేహం చేశాం. వాళ్లకు మననుంచి లాభం, సేవలూ, దొరికినంతకాలం స్నేహంగా ఉంటారు. మనం, వాళ్లూ ఒకటేనన్నట్లు ఉంటారు. అవి దొరకవనుకుంటే వాళ్లు మనల్ని చాలా తెలివిగా, కర్కశంగా నెట్టేస్తారు. ఇది మనకు లోకరీతిగా తెలుసు. అనుభవంలోంచి ఇవాళ నేర్చుకున్నాం.

ఇంజనీర్నీ, నన్నూ కలిపి మోసం చేయబోయిన వాళ్లతో ఇంజనీరు చాలాస్నేహంగా ఉన్నాడు. డబ్బు నష్టపోయినా ఆయనకేం కోపం రాలేదు. ఎందుకంటే వాళ్లకు డబ్బుంది. డబ్బున్నవాళ్లు ఎన్ని మోసాలైనా చెయ్యవచ్చు. అసలు ఎవరో ఒకర్ని మోసం చెయ్యందే అంతంత డబ్బు ఎట్లా సంపాదిస్తారు? ఇవన్నీ మనకు తెలియనివి కావు. జీవితంలోంచి తెలిసొచ్చాయి గాబట్టి విలువైనవి అయ్యాయి. ఇదింతటితో ముగిద్దాం!''

లత కన్నీళ్లు తుడిచాడు.

''ఔను, ఇదొక పెద్ద గుణపాఠమే!'' దుఃఖం నిగ్రహించుకుంది లత.

''నేను లోకం గురించి ఇంకో పాఠం కూడా నేర్చుకున్నాను, లతా! డబ్బులేని వాళ్లపట్ల లోకం ఎంత కర్కశంగా ఉంటుందో కూడా నాకు బాగా అర్థమైంది. ఇంజనీరు నిన్ను తిట్టాడు. నన్ను తిట్టి, కొట్టాడు. ఆయన మూర్ఖుడు. అదాయన స్వభావం. కాస్త ఎబ్‌నార్మల్ అని అందరూ సర్దిచెప్పారు. నా అవమానం వాళ్లెవరికీ అర్థం కాదు! అర్థం కావాలని కూడా నేననుకోను. ఎవరి అవమానాలు వాళ్లే భరించాలి. ఎవరి చర్మాల్ని వాళ్లే రక్షించుకోవాలి. కానీ నేను గనక నిన్ను తనన్న మాటలు భరించలేక ఇంజనీర్ని కొడితే ఏమయ్యేదో ఆలోచించు. అందరూ నాపట్ల ఎంత కర్కశంగా ప్రవర్తించేవాళ్లో నాకు కళ్లకు కట్టినట్లు కనపడుతోంది.''

''మనం ఇంజనీరుగార్ని మోసం చెయ్యబోతే, అదాయన కనిపెట్టి అడిగితే, నేను కొట్టాననేవాళ్లు. నామీదకు వచ్చేవాళ్లు. నన్ను కొట్టేవాళ్లు. కేసు పెట్టేవాళ్లు. అరెస్టు చేయించేవాళ్లు! బహుశా చంపించేవాళ్లు! మనం ఎంతో స్నేహితులమనుకునేవాళ్లు కూడా నువ్వు చేసుకున్నదానికి నువ్వు అనుభవించాల్సిందే ననేవాళ్లు. ఒక్క సానుభూతి వాక్యం మనకు వినపడేది కాదు. డబ్బులేనివాళ్లకు బలహీనంగానో, ఎబ్‌నార్మల్‌గానో, ఎమోషనల్ గానో ఉండే అవకాశం లేదు. లోకంలో ఎంత కర్కశత్వం ఉంది! డబ్బు ఈ కర్కశత్వాన్ని ఎట్లా పెంచి పోషిస్తోంది!''

''ఈ డబ్బుతో ఎలాంటి సంబంధం పెట్టుకోవాలి? దాన్ని జయించాలా? దానిచేత జయించబడాలా? అది నిర్ణయించుకునే శక్తి మన చేతుల్లో ఉందా? డబ్బున్నవాడు లేనివాడిని చేసే అవమానం క్షమార్హం. ఎక్కువకులంవాడు తక్కువ కులంవాడిని అవమానిస్తే, మగవాడు చేసే అవమానం ఆడది సహిస్తున్నట్లు సహించాలి. భరించాలి. ఈ సూత్రాల్నే ఈ మధ్య తరగతి నమ్ముతోంది. పై తరగతి ఆచరిస్తోంది. ఎటువంటివాళ్లూ దీనికి మినహాయింపు కాదు! మనం మాత్రం మినహాయింపు కావాలి. దానికి మనం చాలా ప్రయత్నం చేయాలి. మరింత మనుషులంగా మారాలి. ఆ ప్రయత్నానికీ, మనల్ని మరింత మానవీయంగా చేసుకునేందుకూ ఈ అనుభవం పనికివచ్చిందనుకుందాం!''

లత ఇప్పుడు తన కన్నీళ్లు తుడుచుకుని నవ్వింది.

"మనం ఎంత బలమైన మనుషులం! ఒకరికొకరం ఉన్నాం. లోకంలో ఉన్న కర్క శత్వమంతా మనమీదకు రానీ మనం చిరునవ్వుతో ఎదుర్కొందాం. మరింత గట్టిపడదాం!'
'

జాఫర్ లతను గట్టిగా కౌగలించుకుని దుఃఖంతో మలినమైన ఆమె ముఖాన్ని అపురూపంగా ముద్దాడాడు.

"పాట పాడవా?" లత ఆర్తిగా అడిగింది. పాడుతున్నాడు జాఫర్.

"బిష్ను ఆజ్ నై చూం శికాయత్ మే కునద్
అజ్ జుదాయీహా శికాయత్ మీ కునద్!"

వేణువేమంటున్నదో విను. విరహ వ్యథను వెల్లడిస్తున్నది. వెదురు పొదనుండి వేరుపడిన వేణువు మళ్లీ స్వస్థానం చేరుకోవాలని గుండె చిల్లులుపడి విలపిస్తున్నది.

ఈ పాటను తన గుండె లోతుల్లోనుంచి పాడుతున్నాడు జాఫర్ -

తన వర్గాన్ని తాను చేరుకోవాలనే ఆర్తి, రాగమై జాఫర్ గొంతులోంచి బయటకు దూకుతోంది.

*(24-31.8.1998, ఆంధ్రప్రభ)*

కథా నిలయం
శ్రీకాకుళం